క్లుప్తంగా

స్నేహ పూర్వకంగా వ్యవహరించాలి



సిబ్బంది సామగ్రిని పరిశీలిస్తున్న డీఎస్పీ చంద్రభాను

గుండాల: ఏజెన్సీలో విధులు నిర్వహిస్తున్న పోలీసులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలతో ఫ్రెండ్లీ పోలీస్‌గా వ్యవహరించాలని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆయన గురువారం తనిఖీ చేశారు. గత సంవత్సర కాలంలోని కేసులు, రికార్డులను పరిశీలించారు. సిబ్బంది విధుల్లో వాడే సామాన్లను పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కేసుల వివరాలను సీఐ రవీందర్‌ను అడిగితెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎస్సై సైదా రహూఫ్, సిబ్బంది ఉన్నారు.

గ్రంథాలయ చైర్మన్ పర్యటన

దమ్మపేట: మండల కేంద్రం దమ్మపేటలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు గురువారం పర్యటించారు. దమ్మపేటలో నూతన గ్రంథాలయ భవనాన్ని నిర్మించాలని గ్రామస్తులు చైర్మన్‌కు విన్నవించగా.. భవనం మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో చైర్మన్‌ను శాలువాతో సత్కరించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, సొసైటీ డైరెక్టర్ చిన్నశెట్టి సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు చిన్నశెట్టి యుగంధర్, చిట్టిబాబు, చిన్నశెట్టి గోపి, శ్రీరాముల రమేష్, రాంబాబు పాల్గొన్నారు.

సంఘీభావ ర్యాలీ

మణుగూరుటౌన్: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను వ్యతిరేకిస్తూ.. పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలుపుతూ.. అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మణుగూరు తహసీల్దార్ కార్యాలయం నుంచి పూలమార్కెట్ వరకు గురువారం భారీ ప్రదర్శన నిర్వహించారు. ప్రపంచ శాంతి వర్ధిల్లాలని, పాలస్తీనా ప్రజలను రక్షించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు ముద్దా బిక్షం, ఆర్.మధుసూదన్‌రెడ్డి, మల్లెల రామయ్య, వట్టం నారాయణదొర, వై.పూర్ణచందర్‌రావు, వాసిరెడ్డి చలపతిరావు, చంద్రం, నాగేశ్వరరావు, నాజర్‌పాషా, నెల్లూరు నాగేశ్వరరావు, సాంబశివరావు, నైనారపు నాగేశ్వరరావు, గడ్డం వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ఎన్నికల హామీని నెరవేర్చాలి

కరకగూడెం: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు గడుస్తున్నా పంచాయతీ కార్మికులకు కనీసం వేతనాలు చెల్లిస్తామని ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నేటికీ అమలు చేయడం లేదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గద్దల శ్రీనివాసరావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం పంచాయతీ కార్మికుల నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ గౌరవాధ్యక్షుడిగా గుమ్మడవెల్లి కృష్ణ, అధ్యక్షుడిగా గాంధర్ల ధనంజయ్, ప్రధాన కార్యదర్శిగా చర్ప సాంబశివరావు, ట్రెజరర్‌గా ఉప్పలి సాంబశివరావుతోపాటు ఇతర సభ్యులను ఎన్నుకున్నారు.

ముంపు కష్టాలు పట్టవా?

దుమ్ముగూడెం: మండలంలోని గోదావరి పరివాహక ప్రాంత ప్రజల ముంపు కష్టాలు ప్రజాప్రతినిధులు, అధికారులకు పట్టడం లేదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు యలమంచి వంశీకృష్ణ విమర్శించారు. గురువారం ప్రగల్లపల్లి, సున్నం బట్టి ముంపు ప్రాంతాన్ని సీపీఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా నీట మునిగిన క్రీడా ప్రాంగణాన్ని, అలాగే నీట మునిగిన బైరాలపాడు- సున్నంబట్టి రోడ్డును పరిశీలించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు యానబోయిన వెంకట నరసయ్య, నల్లగొర్ల ప్రభాకర్, కుంచెం వెంకట నరసయ్య, సంతోష్, దుర్గయ్య, బంటు శ్రీను, కొండా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించాలి

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని ఓబీ కంపెనీల్లో సింగరేణి భూనిర్వాసిత, ప్రభావిత ప్రాంతాల యువతకు, స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ ఇఫ్టూ ఆధ్వర్యంలో ఏరియా ఎస్ఓటూ జీఎం బి.శ్రీనివాసచారికి గురువారం వినతిపత్రం అందజేశారు. నాయకులు ఇఫ్టూ అనుబంధ జీఎల్‌బీకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌డి.నాసర్‌పాషా, నాగేశ్వరరావు, ఏ.మంగీలాల్, పి.నాగార్జున, లాలయ్య, ప్రణయ్, ఎం.భద్రయ్య, కాంతారావు, వెంకట్రావు, వీరస్వామి, చంద్రం, దేవేందర్, శ్రీనివాసరావు, ప్రేమ్‌కుమార్, మనోజ్‌కుమార్, కృష్ణ, సతీష్, శంకరమ్మ పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి

మణుగూరురూరల్: వినాయకచవితిని పురస్కరించుకుని గణేష్ మండపాల వద్ద ఉత్సవ కమిటీల వారు, ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లు విద్యుత్ భద్రత ప్రమాణాలను పాటించాలని మణుగూరు ఏడీఈ ఉమారావు గురువారం ఓ ప్రకటనలో సూచించారు.

ఫీడర్ పనులు షురూ..

- ఇప్పటి వరకు ఒకే ఫీడర్‌పై రెండు గ్రామాలకు సరఫరా
- ఫలితంగా తరచుగా పవర్ కట్
- ప్రత్యేక ఫీడర్‌తో తొలగనున్న సమస్య



మందలపల్లి సబ్ స్టేషన్ కార్యాలయంలో సిద్ధంగా ఉన్న విద్యుత్ బ్రేకర్(ఫీడర్) సామగ్రి

దమ్మపేట: మండలంలోని మందలపల్లి గ్రామంలో ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని మందలపల్లి సబ్ స్టేషన్ నుంచి దమ్మపేట గ్రామానికి ప్రత్యేక విద్యుత్ ఫీడర్ (బ్రేకర్) మంజూరు కాగా.. అందుకు సంబంధించిన పనులు కొనసాగుతున్నాయి. దీంతో ఇప్పటి వరకు విద్యుత్ సమస్యలు ఎదుర్కొన్న గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేటి వరకూ సమస్యే..

మండలంలోని మందలపల్లి గ్రామంలోని ప్రధాన సెంటర్, ప్రకాష్‌నగర్ కాలనీ, ప్రభుత్వ కార్యాలయాలతో పాటుగా దమ్మపేట మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని అన్ని ప్రాంతాలకు మందలపల్లి సబ్ స్టేషన్‌లో ఉన్న ఒకే ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరా జరుగుతోంది. ఈ నేపథ్యంలో మందలపల్లిలో ఏ చిన్న విద్యుత్ సమస్య వచ్చినా.. దాదాపుగా 15 వేలకు పైగా జనాభా నివసించే దమ్మపేట మేజర్ గ్రామ పంచాయితీకి విద్యుత్ సరఫరా నిలిపివేస్తూ వస్తున్నారు. దీంతో దమ్మపేట గ్రామ ప్రజలు అనేక ఇబ్బంది పడుతున్నారు. పలు సందర్భాల్లో కొన్ని గంటల పాటు పవర్ కట్ ఉండడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. పెట్రోల్ బంక్, చేతివృత్తుల వారు ఇన్వర్టర్లు, జనరేటర్లను ఉపయోగించిన కారణంగా ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో దమ్మపేటవాసులు విద్యుత్ అధికారులకు సమస్యను పరిష్కరించాలని పలుమార్లు విన్నవించారు.

నూతన ఫీడర్ మంజూరు

దమ్మపేట గ్రామ ప్రజల విన్నపం మేరకు ఎట్టకేలకు సుమారు రూ.30 లక్షల వ్యయంతో నూతన ఫీడర్ మంజూరు అయింది. దీనికి సంబంధించిన విద్యుత్ స్తంభాలు, వైర్లు, బ్రేకర్, ఇన్సులేటర్లు మందలపల్లి సబ్ స్టేషన్‌కు చేరుకున్నాయి. ఈ ఫీడర్ నిర్మాణానికి, మందలపల్లి ప్రకాష్‌నగర్ కాలనీలో నూతన విద్యుత్తు లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. ఇంకను నూతన ఫీడర్‌కు సంబంధించిన పనులు కొనసాగుతున్నాయి. కొత్త ఫీడర్‌ను మందలపల్లికి కేటాయించి, పాత ఫీడర్‌ను దమ్మపేటకు కేటాయించనున్నారు.

ఎదురుచూస్తున్నాం..



దమ్మపేట గ్రామానికి ప్రత్యేక విద్యుత్ ఫీడర్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్నాం. ఈ మేరకు నూతన ఫీడర్ మంజూరై, పనులు ప్రారంభం కావడం శుభపరిణామం. పనులను త్వరితగతిన పూర్తి చేసి, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని కోరుతున్నా.

– చెక్కిరాల మల్లేశ్వరరావు, దమ్మపేట

ఇబ్బందులు పడ్డాం..



దమ్మపేట, మందలపల్లి గ్రామాలకు కలిపి ఒకే ఫీడర్ ఉన్న కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడాయి. దీని వల్ల పలుమార్లు అనేక ఇబ్బందులు పడ్డాం. ఈ విద్యుత్ అంతరాయాల వలన ఇన్వర్టర్లు, జనరేటర్లపై ఆధారపడాల్సి వస్తుంది. ఈ సమస్యకు పరిష్కారంగా నూతన ఫీడర్ మంజూరు కావడం హర్షించదగిన విషయం.

– శ్రీను, ఫాన్సీ షాపు నిర్వాహకులు, దమ్మపేట

త్వరలోనే పూర్తి చేస్తాం..



నూతనంగా మంజూరైన విద్యుత్ ఫీడర్ పనులు వడివడిగా కొనసాగుతున్నాయి. త్వరలోనే పూర్తి చేసి మందలపల్లి, దమ్మపేట గ్రామాలకు వేర్వేరు ఫీడర్ల ద్వారా విద్యుత్ సరఫరా చేస్తాం. అతి త్వరలోనే దమ్మపేట గ్రామ ప్రజల విద్యుత్ అంతరాయ సమస్యకు పరిష్కారం చూపుతాం.

– వెంకటరత్నం, ఏడీఈ, విద్యుత్ శాఖ, అశ్వారావుపేట

ఆశ్రమ పాఠశాలలో తనిఖీ



దమ్మపేట: పెద్దగొల్లగూడెంలో క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

దమ్మపేట: మండలంలోని దుర్గం గొల్లగూడెం బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ, డార్మెటరీ, తరగతి గదులను పరిశీలించారు. వంటశాలను తనిఖీ చేసి, విద్యార్థులతో పాటుగా క్యూలైన్‌లో నిలబడి అల్పాహారాన్ని భుజించి, సంతృప్తి వ్యక్తం చేశారు. నూతన మెనూ సక్రమంగా అమలు చేయాలని బాధ్యులకు సూచించారు. అనంతరం దమ్మపేట మండల ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్దగొల్లగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. సరదాగా కాసేపు క్రికెట్ ఆడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ, డిప్యూటీ వార్డెన్ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ అండ్ ఇగ్నైట్..

ములకలపల్లి: కేజీబీవీ, కమలాపురం ఆశ్రమ పాఠశాల, గురుకులంలో ఏర్పాటు చేసిన ఇన్‌స్పైర్ అండ్ ఇగ్నైట్ కార్యక్రమంలో ఎమ్మెల్యే జారే పాల్గొన్నారు. లక్ష్య సాధనపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. గురుకులంలో సెల్ఫీ పాయింట్ వద్ద ఫోటోలు దిగారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా రెండోసారి ఎంపికైన తాండ్ర ప్రభాకర్‌రావు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేశారు. తహసీల్దార్ భూక్యా గనియా నాయక్, ఎంపీడీఓ సత్యనారాయణ, ప్రిన్సిపాళ్లు మహేశ్వరి, రాములు, సునీత, కారం సుధీర్, నాగళ్ల వెంకటేశ్వరరావు, గాడి తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీవీకే.రావు సేవలు మరువలేనివి..

చర్ల: విద్యావేత్త, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించిన సీవీకే.రావు సేవలు మరువలేనివని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పేర్కొన్నారు. మండలంలోని రైస్‌పేటలో గురువారం సీవీకే.రావు మూడో వర్ధంతి సభ కాంగ్రెస్ నాయకుడు చీమలమర్రి మురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీవీకే.రావు 1970లో అప్పటి సీఎం జలగం వెంగళరావును ఒప్పించి తాలిపేరు ప్రాజెక్టుకు రూపకల్పన చేయించారని తెలిపారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్టేషనరీ, ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. కార్యక్రమంలో సీవీకే.రావు కుమారుడు, న్యాయవాది సీవీ. సతీష్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు నల్లపు దుర్గాప్రసాదరావు, నాగ సీతారామారావుతో పాటు చింతూరు వెంకట్రావు, తడికల లాలయ్య, పరుచూరి రవికుమార్, ఇందుల బుచ్చిబాబు, గుండేపూడి భాస్కర్‌రావు, చీమకుర్తి వీరభద్రం, కొత్తపల్లి ఆంజనేయులు, కాపుల కృష్ణార్జునరావు, లంకారాజు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

అశ్వారావుపేటరూరల్: సెల్‌ఫోన్ పాగొట్టుకున్న విద్యార్థినికి గురువారం పోలీసులు అప్పగించారు. అశ్వారావుపేటలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాలలో చదువుతున్న పి.ఐశ్వర్య తన సెల్‌ఫోన్‌ను పదిహేను రోజుల క్రితం పోగొట్టుకుంది. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌తోపాటు సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్‌లో ఫిర్యాదు చేయగా... గుర్తు తెలియని వ్యక్తులకు దొరికిన ఫోన్‌ను అశ్వారావుపేటలోని ఓ షాపులో విక్రయించినట్లు గుర్తించారు. దీంతో ఫోన్‌ను రికవరీ చేసి గురువారం ఐశ్వర్యకు అప్పగించామని ట్రైనీ ఎస్సై అఖిల తెలిపారు. చోరీకి గురైన మొత్తం 13 సెల్‌ఫోన్లను రికవరీ చేశామని, బాధితుల వద్ద ఆధారాలు పరిశీలించి వారికి అందిస్తామని ఆమె తెలిపారు.

వచ్చేనెల కేటీఆర్ పర్యటన

భద్రాచలంటౌన్: మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వచ్చే నెల భద్రాచలంలో పర్యటిస్తారని పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు తెలిపారు. భద్రాచలంలో గురువారం జరిగిన మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రాచలంలో ఏ ఎన్నిక జరిగినా గులాబీ జెండా ఎగిరేలా కార్యకర్తలు సిద్ధం కావాలని సూచించారు. సమష్టి నిర్ణయాలతో భద్రాచలం మండలంలో అన్ని వార్డుల్లో కమిటీలు వేయాలని తెలిపారు. నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానే రామకృష్ణ, తాండ్ర వెంకట రామారావు, బోదెబోయిన బుచ్చయ్య, ఆకోజు సునీల్, రేపాక పూర్ణచంద్రరావు, సీతామహాలక్ష్మి, పూజల లక్ష్మి, కోటగిరి ప్రబోధ్‌కుమార్, జయ ప్రేమ్‌కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం సీఐగా వెంకటప్పయ్య

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా తాళ్లూరి వెంకటప్పయ్యను నియమిస్తూ పోలీస్ ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గత రెండు నెలల క్రితం వరకు దుమ్ముగూడెం పోలీస్‌స్టేషన్‌లోనే వెంకటప్పయ్య ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తూ సీఐగా పదోన్నతి పొంది జిల్లా ఎస్పీ కార్యాలయంలో అటాచ్ అయ్యారు. ప్రస్తుతం ఉన్నతాధికారులు మండల ఎస్‌హెచ్‌ఓగా నియమించారు. కాగా ఇక్కడ సీఐగా విధులు నిర్వహిస్తూ డీఎస్పీగా పదోన్నతి పొందిన బొడ్డు అశోక్.. హైదరబాద్‌లో సైబర్ సెక్యూరిటీ వింగ్ డీఎస్పీగా బదిలీ అయ్యారు.

25న వాహనాల వేలం

భద్రాచలంటౌన్: భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 25వ తేదీన వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ రహీముల్లా బేగం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఉదయం 10 గంటలకు ఎక్సైజ్ స్టేషన్‌లో జరిగే వేలంలో పాల్గొనాలని సూచించారు.

బీఆర్‌ఎస్ నాయకుడికి పరామర్శ

అశ్వాపురం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు జాలె రామకృష్ణారెడ్డిని గురువారం డీసీసీబీ డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు తుళ్లూరి బ్రహ్మయ్య పరామర్శించారు. మండల పరిధిలోని గరిడబ్బ వద్ద కడియాల బుడ్డివాగు వద్ద మొండికుంట–భద్రాచలం రహదారికి గోదావరి వరదనీరు చేరి రాకపోకలు నిలిచిన ప్రాంతాన్ని బ్రహ్మయ్య పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కమటం నరేష్, నాయకులు కొప్పుల శ్రీనివాసరెడ్డి, కొండబత్తుల ఉపేందర్, పర్వత నరేష్, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


హోమియోపతి వైద్య శిబిరం

దుమ్ముగూడెం: మండలంలోని బండిరేవు గ్రామంలోని ఎంపీయూపీఎస్ పాఠశాలలో పర్ణశాల హోమియోపతి డాక్టర్ రాజేష్ ఆధ్వర్యంలో ఉచిత హోమియోపతి మెడికల్ క్యాంపు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పరీక్షించి మందులను అందజేశారు. సీజనల్ వ్యాధులపట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. క్యాంపులో ఫార్మాసిస్ట్ హరితేజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరస్పర ఆరోపణలు ఆపాలి

దమ్మపేట: యూరియా సరఫరా విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర ఆరోపణలను ఆపి, రైతుల డిమాండ్ మేరకు యూరియాను సరఫరా చేయాలని సీపీఎం జిల్లా నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో పుల్లయ్య మాట్లాడుతూ... రైతులకు సకాలంలో యూరియాను అందించడంలో ప్రభుత్వం విఫలమయిందని విమర్శించారు. నాయకులు పిట్టల అర్జున్, మోరంపూడి శ్రీనివాసరావు, దొడ్డా లక్ష్మీనారాయణ, నాయుడు, రఘు పాల్గొన్నారు.

నానో యూరియాతో ఫలితం



కరకగూడెం: రైతులకు నానో యూరియాపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ తాతారావు

కరకగూడెం: సాంప్రదాయ యూరియాతో పోలిస్తే నానో యూరియా తక్కువ ఖర్చుతో ఉత్తమ ఫలితాలు ఇస్తుందని మణుగూరు ఏడీఏ తాతారావు పేర్కొన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని పలు ఫెర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో దుకాణాల రికార్డులు, స్టాక్ వివరాలు, విక్రయ ధరలు వంటి వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. రైతులు మోసపోకుండా సరైన ధరలకు ఎరువులను అందించాలని దుకాణదారులకు సూచించారు. అనంతరం అక్కడే ఉన్న రైతులకు పంట నానో యూరియా ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓలు ప్రశాంత్,అనిల్ కుమార్,నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మండల రైతులకు తమ పంటల సాగులో యూరియాకు బదులుగా నానో యూరియాను వినియోగించడం మంచిదని మణుగూరు ఏఈఓ కొమరం లక్ష్మణ్ రావు సూచించారు. గురువారం ఆయన నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఆధునిక, స్మార్ట్ ఎరువు రూపమే నానో యూరియా అని, తక్కువ ఖర్చుతో సమృద్ధిగా నత్రజనిని అందిస్తుందని తెలిపారు. ప్రతీ ఎకరానికి 500 ఎంఎల్ నానో యూరియాను పంట పెరుగుదల సమయంలో పిచికారీ చేయడం ఉత్తమమన్నారు. కార్యక్రమంలో ఏఈఓ హారిక, రైతులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



పినపాక: చింతల బయ్యారం వద్ద గోదావరిని పరిశీలిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

దుమ్ముగూడెం: గోదావరికి భారీగా వరద వస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ అశోక్‌కుమార్ సూచించారు. గురువారం గోదావరి ముంపు ప్రాంత గ్రామమైన సున్నంబట్టిని పడవపై దాటి స్థానికులతో మాట్లాడారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారు ఉంటే వెంటనే వైద్య సిబ్బందికి తెలియచేయాలని, ఏదైనా అత్యవసరం అయితే తక్షణమే మండల అధికారులను సంప్రదించాలని సూచించారు. అనంతరం మంగ్వాయిబాడ్వ గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఆర్‌ఐలు కల్లూరి వెంకటేశ్వరరావు, నరసింహారావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

మణుగూరుటౌన్: గోదావరి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో మున్సిపాలిటీ శివారు గ్రామాలైన రాయిగూడెం, కమలాపురం గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. గురువారం గోదావరిని పరిశీలించిన అధికారులు.. గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. పశువులు కొండపైన కట్టేయాలని, ముంపు ప్రాంతాల ప్రజలు అత్యవసర సామగ్రి తీసుకుని ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేశ్, సీఐ నాగబాబు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, ఎస్ఐ రంజిత్‌లు ఉన్నారు.

పినపాక: గోదావరి ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో ప్రభావిత ప్రాంతాల ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ గోపాలకృష్ణ సూచించారు. ఈ మేరకు గురువారం మండల పరిధిలోని చింతల బయ్యారం, భూపతిరావుపేట వద్ద గోదావరి ఆయన పరిశీలించారు. గోదావరి గంట గంటకూ పెరుగుతున్న నేపథ్యంలో జాలర్లు, గ్రామస్తులు ఎవరు చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు. గోదావరి పెరిగితే వెంటనే పునరావాస కేంద్రాలకు తరలిరావాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

గుండాల: స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గురువారం మండలంలో పర్యటించి రూ.65 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. కమ్యునిటీ శానిటరీ కాంప్లెక్స్ నూతన భవనానికి భూమి పూజ, పెద్దూరు–పాతూరు మధ్య జల్లేరుపై రూ.80 లక్షలతో నిర్మించిన బ్రిడ్జిని ప్రారంభించారు. ఆటోలో ప్రయాణిస్తూ ప్రజల సమస్యలను అడిగితెలుసుకున్నారు. తహశీల్దార్ శ్రీనివాస యాదవ్, ఎంపీడీఓ శ్రీనివాస్, పీఆర్‌డీఈ రామనాథం, ఏఈ వినీత్, ప్రభుత్వ వైద్యాధికారి సంఘమిత్ర, రేవంత్, ఎంఈఓ శాంతారావు, మాజీ ఎంపీపీ పాపారావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాయం రామనర్సయ్య, పడిగ సమ్మయ్య, ఎస్‌కె.ఖదీర్, దారా అశోక్, శ్రీకాంత్, ఎండీ.అతహత్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన టీబీజీకేఎస్ నాయకులు



కేటీఆర్‌తో టీబీజీకేఎస్ నేత నాగెల్లి వెంకట్, ఇతర నాయకులు

మణుగూరుటౌన్: బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆయన నివాసంలో మణుగూరు టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు నాగెల్లి వెంకట్ గురువారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేయగా.. ఏరియాలో టీబీజీకేఎస్ బలోపేతం అవుతున్న తీరును, కార్మిక వారి కుటుంబ సభ్యులకు నాయకులు అందించే సేవలను కేటీఆర్ ప్రశంసిస్తూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ సభ్యులు బంగారి పవన్‌కుమార్, మునిగెల నాగేశ్వరరావు, రామాచారి, మస్తాన్, ముకేశ్‌కుమార్, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

కాంట్రాక్టర్ వేధింపులకు అడ్డుకట్ట వేయాలి

మణుగూరుటౌన్: ఓసీ–2లోని వాషింగ్ ప్లాంట్‌లో కాంట్రాక్టర్ వేధింపులను అరికట్టాలని ఐఎన్‌టీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం పీఓ లక్ష్మీపతిగౌడ్‌కు వినతిపత్రం అందజేశాక.. ఐఎన్‌టీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు కృష్ణంరాజు, కార్యదర్శి గట్టయ్య మాట్లాడారు. కొన్నేళ్లుగా పనిచేస్తున్న కార్మికులతో అనుచితంగా ప్రవర్తిస్తూ.. జరిమానా పేరుతో కాంట్రాక్టర్ వేధిస్తున్నాడని తెలిపారు. అంతేకాక కొందరిని తొలగించారని చెప్పారు. తొలగించబడిన కాంట్రాక్ట్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకుని, కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు.

నిధులు విడుదల చేయాలి



దమ్మపేట మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

సాక్షి నెట్‌వర్క్: గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసిందని, పంచాయతీలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడమే ఇందుకు కారణమని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు వెంటనే నిధులు విడుదల చేసి పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని డిమాండ్ చేస్తూ.. మండల కేంద్రాల్లో ఎంపీడీఓ కార్యాలయాల వద్ద నిరసనలు చేపట్టారు. సమస్యలు పరిష్కరించాలని కార్యాలయ అధికారులకు వినతిపత్రాలు అందించారు.

బియ్యం వితరణ



బియ్యం బ్యాగ్ అందజేస్తున్న దాతలు

భద్రాచలంటౌన్: అనారోగ్యంతో పాటు ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న పట్టణానికి చెందిన హిందీ పండిట్ ఏవీ రావుకు చేతన మీసేవ నిర్వాహకుడు భూక్యా రంజిత్ నాయక్ 25 కిలోల బియ్యం బ్యాగును గురువారం అందజేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దిన మాస్టర్.. ఆరోగ్యం సహకరించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. దాతలు ముందుకు వచ్చి మాస్టర్‌కి సహాయం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో క్లాసిక్ షరీఫ్, బొల్లినేని ధర్మారావు, విజయ్, ప్రేమ్ పాల్గొన్నారు.

23న 'చలో హైదరాబాద్'

గుండాల: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై ఈనెల 23న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జోగ రాంబాబు పిలుపునిచ్చారు. ఆళ్లపల్లి మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బానోత్ భోజ్యా, ఈసం ముత్తయ్యలు తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రాంతాల్లో ఎమ్మెల్యేల పర్యటన



దుమ్ముగూడెం: పడవపై సున్నంబట్టి గ్రామానికి వెళ్తున్న ఎమ్మెల్యే తెల్లం, సీఐ, మార్కెట్ చైర్మన్



బూర్గంపాడు వద్ద వరద ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

దుమ్ముగూడెం: మండలంలోని గోదావరి వరద ముంపు గ్రామం సున్నంబట్టిలో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు గురువారం పర్యటించారు. సున్నంబట్టి–బైరాగులపాడు రహదారి పైకి చేరిన వరద నీటిలో పడవలో ప్రయాణించి గ్రామం చేరుకున్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పునరావాసం కింద మైదాన ప్రాంతంలో తమకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, ఆర్‌ఎన్‌ఆర్ ప్యాకేజీ అందించి, వంతెన నిర్మాణం చేపట్టాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. ఆయన స్పందిస్తూ.. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ, సీఐ అశోక్, ఎంపీడీఓ వివేక్‌రామ్, ఎంపీఓ బద్ది రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు లంకా శ్రీనివాసరావు, యంబడి అర్జున్ రావు తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో పాయం..

బూర్గంపాడు: గోదావరి వరదల నేపథ్యంలో అధికార యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాలని పినపాక శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు సూచించారు. బూర్గంపాడు మండలంలోని వరద ముంపు ప్రాంతాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పంటలు నీటమునిగిన రైతులతో ఆయన మాట్లాడారు. ఇళ్లలోకి నీరు చేరిన బాధితులతో మాట్లాడి వారికి ప్రభుత్వపరంగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. అధికారులు పలు సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ కె.ఆర్‌కేవీ ప్రసాద్, ఎంపీడీఓ జమలారెడ్డి, ఎంపీఓ బాలయ్య, ఎస్ఐ మేడ ప్రసాద్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.